విద్యారంగానికి పాతర

గొప్పగా ప్రగల్భాలు.. కేటాయింపులు అంతంతే..

విద్యా రంగానికి తీరని అన్యాయం

ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

ఎల్బీనగర్, జూలై 26: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కానుగుల అరుణ్, మీసాల స్టాలిన్ అన్నారు. ఇందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించేందుకు మాటల గారడితో విద్యారంగాన్ని ప్రోత్సహిస్తామని ఎంతో గొప్పగా ప్రగల్భాలు పలికి గత ప్రభుత్వ ఆనవాయితినే అనుసరించి 7.3 శాతం మాత్రమే విద్యారంగానికి నిధులు కేటాయించడం దేనికి నిదర్శనమో ఒకసారి పునరాలోచించుకోవాలి అన్నారు. గత ఓటాస్ బడ్జెట్ కేటాయింపుకంటే తక్కువ కేటాయించి విద్యాభివృద్ధి పట్ల నీతులు వల్లించడం సిగ్గు చేటని ప్రభుత్వాన్ని విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో విద్యాభివృద్ధి కోసం రూ.21,389 కోట్లు కేటాయిస్తే, రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరీ అంతకంటే హీనంగా దిగజారి కంటితూడ్పుగా రూ.21,292 కోట్లు మాత్రమే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిధులతో ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయడం అవునో, కాదో, కానీ నిర్వీర్యపర్చాలని చూస్తున్నట్లు మాత్రం ఎవరికైనా స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ప్రభుత్వ విద్యాభివృద్ధికి సరిపడ నిధులు కేటాయించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వ ధ్వంద వైఖరిని ఎండగడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, ఉదయ్, శ్రీకాంత్, మల్లేశ్, పృథ్వి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

వనస్థలిపురం, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చన్నోజు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యకు 15శాతం కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్యాయం చేస్తోందన్నారు. కేవలం 7.3శాతం కేటాయించి చేతులు దులుపుకొన్నారన్నారు. అరకొర బడ్జెట్‌తో నాణ్యమైన విద్యను ఎలా ఇస్తామన్నారు. ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి బహిర్గతమవుతుందన్నారు. బడ్జెట్‌ను సమీక్షించి విద్యకు అధిక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో 25శాతం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టు రమేష్, చేపూరి చంద్రశేఖర్‌రెడ్డి, సభావత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెన్నోజు శ్రీనివాసులు తదితరులు

రేపు మన్సూరాబాద్‌లో బోనాలు

బోనాల ఉత్సవాల కోసం ముస్తాబైన సీఆర్ ఎన్‌క్లేవ్‌లోని పోచమ్మ దేవాలయం

మన్సూరాబాద్, జూలై 26: మన్సూరాబాద్‌లో ఆదివారం జరుపుకోనున్న బోనాల ఉత్సవాల కోసం డివిజన్ పరిధిలోని పలు అమ్మవార్ల దేవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణతో పాటు బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు ఆలయాల కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సీఆర్ ఎన్‌క్లేవ్‌కాలనీలోని స్వయంభూ పోచమ్మ దేవాలయంలో బోనాలు సమర్పించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 40 నుంచి 50 కాలనీల ప్రజలు రానున్నారు. ఎంతో విశిష్టత కలిగిన సీఆర్ ఎన్‌క్లేవ్ పోచమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు 15 వేల మంది భక్తులు రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించనున్నారు. అనంతరం నిత్యపూజ, అర్చనలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి బోనాల సమర్పణ ప్రారంభమవుతుంది. దీంతో పాటు శుభోదయకాలనీలోని విజయదుర్గా దేవాలయం, జడ్జెస్‌కాలనీలోని నల్లపోచమ్మ, మన్సూరాబాద్‌లోని చిత్తారమ్మ, పెద్దచెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మ దేవాలయాలను బోనాల ఉత్సవాల కోసం సుందరీకరించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా..

మన్సూరాబాద్ సీఆర్ ఎన్‌క్లేవ్‌కాలనీలోని స్వయంభూ పోచమ్మదేవి అమ్మవారిని సందర్శించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు తీసుకుంటున్నాం. అమ్మవారిని సందర్శించుకోవడంతో పాటు బోనాలను సమర్పించేందుకు సుమారు 15 వేల మంది భక్తులు రానున్నట్లు అంచనా వేశాం. ఆలయానికి వచ్చే భక్తులు క్యూలైన్ పద్ధతిని పాటిస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించేలా బారికేడ్లు ఏర్పాటు చేశాం. భారీగా తరలివచ్చే వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు తదితర సదుపాయాలను ఆలయ కమిటీ కల్పిస్తుంది.

– కొప్పుల విఠల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్, పోచమ్మ దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్

బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఆలయ కమిటీలకు వీధి లైట్లను అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్ తదితరులు

వనస్థలిపురం, జూలై 26: బోనాల పండుగకు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం ఎక్కడా చీకటి లేకుండా అవసరమైన చోట్ల లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను ప్రజలు వైభవంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ విద్యుత్ విభాగం ఏఈ జగన్నాథం, ఇంజినీరింగ్ ఏఈ హేమునాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, యాదగిరి, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలి

వనస్థలిపురం, జూలై 26: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేజ్-1లో జరిగే బోనాల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ తూము భూపాల్‌రెడ్డి కోరారు. పోచమ్మ దేవాలయంలో ఈ నెల 28న ఆదివారం ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. భక్తులు బోనాలతో అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉత్సవాలను హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు.

పార్కులను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీపురం కాలనీలో పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 26: ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచే పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో జరుగుతున్న పార్కు పనులను జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ వాసుల సౌకర్యార్థం పార్కును నిర్మిస్తున్నామన్నారు. పనులను పూర్తి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వర్షాల నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ దామోదర్‌రావు, ఏఈ నరేందర్ తేజ, ముత్యం రావు, బాకారం నరసింహారెడ్డి, సూర్యవర్ధన్‌రెడ్డి, పద్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్య, పరుషోత్తంరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కందుకూరు, జూలై 26: కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉమేశ్ రావు.. బదిలీ అయిన మల్లిక, సుభాత్ రాణి, నాజీర్.. నూతనంగా వచ్చిన రామానుజమ్మ, రాజాక్, భాగ్యమ్మను ఎంపీడీఓ సరిత, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, విద్యాధికారి మనోహర్‌తో కలిసి కొత్తగూడ మాజీ సర్పంచ్ సాద మల్లారెడ్డి, కొత్తూరు ఎంపీటీసీ బొక్క జ్యోతి నర్సింహారెడ్డి శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుభాష్‌రెడ్డి, కవిత, కాంప్లెక్స్ హెచ్ఎంలు అంజయ్య, నర్సింహ, మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ తల్లాజు సరస్వతి, ఆశావర్కర్ అనిత, బొక్క వాణి, బాలేశ్, హన్మంతరెడ్డి, అజీజ్, శివకుమార్, బొక్క రాంచాంద్రరెడ్డి, నరేందర్, పంచాయతీ కార్యదర్శి, వివిధ గ్రామాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

బడంగ్‌పేట, జూలై 26: ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ఎన్‌రెడ్డి నగర్‌లోని హాస్టల్‌లో నివసిస్తున్న అక్కి సిద్ధార్థ గౌడ్ ఈనెల 25న తన స్నేహితుడు కార్తిక్ దగ్గరకు వెళ్లి వచ్చే సరికి తన ల్యాప్‌టాప్ కనిపించలేదు. దీంతో మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి.. చింతల్ కుబ్దుల్లాపూర్‌కు చెందిన పట్ట మహేశ్ అలియాస్ మహేశ్ బాబు 24) అదే ప్రాంతానికి చెందిన లింగయ్య(23)ను అరెస్ట్ చేసి విచారించగా నేరాలు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఎంబీఏ (ఎంఏఎం) రివాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 26 : ఓయూ పరిధిలోని ఎంబీఏ (ఎంఏఎం) పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎంఫార్మసీ వన్‌టైం చాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 26: ఓయూ లో ఎంఫార్మసీ పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి వన్‌టైం చాన్స్ అవకాశం కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2000 తర్వాత ఎంఫార్మసీలో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సులు అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును వచ్చే నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు, పరీక్షా తేదీల పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

కందుకూరు, జూలై 26: రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి కందుకూరులో వ్యవసాయ పంటలను పరిశీలించారు. కందుకూరు, గపూర్‌నగర్, కొత్తూరు, దన్నారం, జైత్వారం కాల్వా, పులిమామిడి తదితర గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. రుణమాఫీ అయ్యిందా..? లేదా అని తెలుసుకున్నారు. మాఫీ అయిన రైతులు బ్యాంకుల్లో తిరిగి పంట రుణాలు తీసుకోవాలని సూచించారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా పాస్ బుక్కులు పొందిన రైతులు ఆగస్టు 5 వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి లావణ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పంచాయతీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

కందుకూరు, జూలై 26: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. కార్మికులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎండీఓ కార్యాలయం ముదు ధర్నా నిర్వహించిన అనంతరం ఎండీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు రాంచందర్, బాల్‌రాజ్ గౌడ్, యాదయ్య, నర్సింహ, ప్రకాశ్, అంజయ్య, రాములు నర్సింహ పాల్గొన్నారు,

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయాలి

ఆగస్టు 9న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కందుకూరు, జూలై 26: ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని.. మాట తప్పిన బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయాలని జాతీయ అధ్యక్షుడు చిన్నగాల్ల యాదగిరి మాదిగ తెలిపారు. కందుకూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ వాల్ సొస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తమను పావుగా వాడుకొని ఎన్నికల అనంతరం మాట తప్పడం అలవాటయ్యిందని పేర్కొన్నారు. ఏబీసీడీ వర్గీకణను చేస్తామని చెప్పిన బీజేపీ పార్టీ అధికారంలోకి రాగానే మాట తప్పుతుందని తెలిపారు. తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. మేడి పాపన్న అధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొని నరేంద్రమోదీ కల్లు తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గడ్డం రాంచదర్, జిల్లా అధ్యక్షుడు ఆదిరాల రవికుమార్, మాజీ జడ్పీటీసీ పెద్ద రామయ్య, బొర్ర రాములు, బాలరాజ్, వెంకటయ్య, యాదగిరి, క్రిష్టఫర్ పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, చిత్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

హయత్‌నగర్‌లో ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌ను నిర్మించండి

హయత్‌నగర్, జూలై 26: హయత్‌నగర్‌లోని విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌ను నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి వినతిపత్రం అందజేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పనామా చౌరస్తా వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ వల్ల స్థానికంగా నివసించే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులకు వ్యాపారం తగ్గిపోయి జీవనాధారం కోల్పోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకుపోవడంతో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించి అండర్‌పాస్ బ్రిడ్జీల స్థానంలో ఎలివేటెడ్ పిల్లర్ల ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి కలిసి చర్చించనున్నట్లు తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించగా కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని వివరించారు.

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని సైదాబాద్ డివిజన్ జయనగర్‌కాలనీలోని సెయింట్ అంథ్రూస్ పాఠశాలలో విద్యార్థులు సైనికుల వేషధారణతో అమరవీరులకు నివాళులర్పించారు.
– సైదాబాద్, జూలై 26

నేదునూరు గ్రామానికి చెందిన వడ్ల లింగయ్యకు ఇళ్లు లేకపోవడంతో ప్లాస్టిక్ కవర్లతో గుడిసె ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు గంగుల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్, సోమరాజ్ వెంకటేశ్ శుక్రవారం రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. – కందుకూరు, జూలై 26

కర్మన్‌ఘాట్ గాయత్రినగర్ చౌరస్తాలోని నాగార్జున ది నెక్స్ట్ జెన్ స్కూల్లో శాకాంబరి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల కూరగాయలతో అలంకరించిన శాకాంబరి అమ్మవారి రూపం అందరిని విశేషంగా ఆకట్టుకున్నది. చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జిలు రూప, జ్యోతి, సరిత, మాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – చంపాపేట

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, జూలై 26: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురుసాని విఠల్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా తెలిపారు. మండల కేంద్రంలోని భూలక్ష్మి మెమోరియల్ ఆస్పత్రిలో కందుకూరు లయన్స్ క్లబ్, ఫెర్టిలిటి సెంటర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో విట్టల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా

మొక్కలు నాటి పరిరక్షించాలి

కందుకూరు, జూలై 26 : మొక్కలు నాటి పరిరక్షించాలని నేదునూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయమోహన్‌రెడ్డి తెలిపారు. పాఠశాల ప్రాగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ అబ్దుల్లా, గ్లోరీ, సురేశ్, క్రిష్ణ, కరుణాకర్, బషీర్, వాణిశ్రీ,రికార్డు అసిస్టెంట్‌లు సర్వర్, శ్రీశైలం, హుస్సేన్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేదునూరు ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు